సర్కార్ నిర్లక్ష్యంతో రోగుల అవస్థలు

ఉస్మానియాలో పడకల్లేక నేలపైనే చికిత్స... టిమ్స్ పూర్తైతే ఈ బాధలు తప్పేవి

సిటీ బ్యూరో/సుల్తాన్ బజార్, మార్చి16, (నమస్తే తెలంగాణ): గత ప్రభుత్వం నిరుపేదలకు ఉచిత వైద్యం అందించేందుకు శ్రీకారం చుడితే, కాంగ్రెస్ పాలకులు దానికి తూట్లు పొడిచే పనిలో ఉన్నారు. విశ్వనగరం హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న ఉస్మానియాకు ఎంతో చరిత్ర దాగుంది. పేరొందిన ఆసుపత్రిగా ఉస్మానియా సుపరిచితం. అలాంటి ఉస్మానియాలో నేడు రోగుల అవస్థలు వర్ణనాతీతం. సరిపడ పడకలు లేక ఇబ్బందులు పడుతూ నేలపైనే పడుకుంటున్నారు. ఉస్మానియాలోని ఎంఎం3 వార్డు కిక్కిరిసిన రోగులు, సహాయకులతో జాతరను తలపిస్తుంది. అసలే రోగాలతో వచ్చిన వాళ్లు ఇరుకు ఇరుకుగా పడుకోవడంతో రోగాలు తగ్గడం లేదన్న వాదన వినిపిస్తోంది. గాంధీ ఆసుపత్రిలో సైతం సరిపడ పడకలు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. దానికితోడు ఆసుపత్రుల గోడలకు పాన్ పరాకు మరకలు దర్శనమిస్తున్నాయి. విచ్చలవిడిగా ఉమ్మడంతో ఉస్మానియా ఆసుపత్రి వార్డుల్లో గోడలు పాన్ మరకలతో నిండాయి. భద్రత సిబ్బంది చూసి చూడనట్టుగా వ్యవహరించడంతో ఆసుపత్రుల్లో పరిశుభ్రత లోపిస్తోంది.

ఉస్మానియాలో పడకలు లేక నేలపై పడుకొని చికిత్స పొందుతున్న రోగి

టిమ్స్ పూర్తయితేనే మేలు..

నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ దూర ప్రాంతాల నుంచి వైద్యంకోసం వచ్చే ప్రజల కోసం అందుబాటులో ఉండేవిధంగా రాష్ట్ర రాజధాని చుట్టూ టిమ్స్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగానే గడ్డి అన్నారం, అల్వాల్, ఎర్రగడ్డ ప్రాంతాల్లో ఒక్కో టిమ్స్ ఆసుపత్రి 1000 పడకలతో నిర్మించేందుకు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రణాళికలు చేసింది. నిర్మాణపు పనులు సైతం చేపట్టింది. మహానగరం చుట్టూ ఉన్న జిల్లా వాసులు నూతనంగా నిర్మించే టిమ్స్‌లల్లో వైద్యం అందనున్నదని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజధాని లోపలికి రాకుండానే ట్రాఫిక్ కష్టాలు లేకుండా సరిహద్దుల్లోనే చికిత్స అందించేందుకు కేసీఆర్ సర్కారు వ్యూహం రచించింది. కానీ అవి నేటికి 50శాతం పనులు మాత్రమే పూర్తి కావడంతో ,ఇంకెప్పుడు పూర్తయితాయనే సందేహం ప్రజల్లో నెలకొంది. రాజధానిలోని గాంధీ, ఉస్మానియా, నిమ్స్ లాంటి ఆసుపత్రుల్లో రోగుల సంఖ్య తగ్గాలంటే టిమ్స్ పూర్తి తప్పనిసరి.

ఉదాహరణలివే..

- పెద్దపల్లికి చెందిన శంకర్ వారం రోజుల క్రితం గడుపు నొప్పితో బాధపడుతూ ఉస్మానియాలో చేరాడు. పడకలు కాళీగా లేకపోవడంతో నేల మీదే పడుకుంటున్నాడు. సరైన వైద్య సదుపాయాలు అందకపోవడంతో ఇబ్బందిపడుతున్నాడు
- వరంగల్‌కు చెందిన రాజు గత ఐదు రోజుల కిందట అనారోగ్యంతో ఉస్మానియాలో చేరాడు. పడకలు లేకపోవడంతో వార్డులో నేలమీదే పడుకుంటున్నాడు.

వసతుల లేమిలో ఉస్మానియా

సహాయకులకు నీడ కరువు
మూలనపడ్డ విద్యుత్ వాహనం

సిటీబ్యూరో/ సుల్తాన్‌బజార్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర రాజధాని నగరం నడిబొడ్డున ఉండి, పేదల ఆసుపత్రిగా పేరు పొందిన ఉస్మానియా ఆసుపత్రిలో నేడు కనీస అవసరాలు కరువైయ్యాయి. రెండు తెలుగురాష్ట్రాలతో పాటు దక్షిణాది రాష్ట్రాలనుంచి వచ్చేవారికి సైతం వైద్య సేవలందించడంలో ముందుండే ఈ దవాఖాన ప్రస్తుతం రోగులు, వారి సహాయకులు పడుతున్న ఇబ్బందులకు నెలవైంది.

విశ్రాంతి కోసం ఇక్కట్లు..

ఉస్మానియా ఆసుపత్రికి ప్రతి రోజు ఔట్ పేషేంట్లు 3000 మంది వస్తుండగా, ఇన్‌పేషెంట్ల సంఖ్య 1200 లకు పైగా ఉంది. వేల సంఖ్యలో చికిత్సకోసం వచ్చే రోగులతో పాటు వారి సహాయకులు సైతం ఉస్మానియా ఆసుపత్రికి వస్తుంటారు. వారంతా తలదాచుకోడానికి సహాయకుల విశ్రాంతి షెల్టర్ లేకపోవడంతో ఆసుపత్రి ఆవరణలో బయటే కూర్చుంటున్నారు. రాత్రి సమయాల్లో వారంతా బయటే నిద్రించడంతో దొంగలు సహాయకుల వస్తువులు దొంగలిస్తున్నారు. సహాయ కేంద్రం లేకనే ఇలాంటి దుర్ఘటనలు జరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిలువ నీడలేకుండా వేల సంఖ్యలో సహాయకులు ఎండలోనే ఉండటం గమనార్హం. విశ్రాంతి తీసుకునేందుకు ఆశ్రయం లేక సహాయకులుగా వచ్చే మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆసుపత్రి ప్రాంగణం బయట అపరిశుభ్రమైన వాతావరణంలో, దోమల నడుమే గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వాహనానికి మరమ్మతులు చేయించండి

ఉస్మానియాకు వచ్చే వయోవృద్ధులు, దివ్యాంగులు, ఆనారోగ్యతో వచ్చేవారికోసం గతంలో విద్యుత్ వాహనాన్ని ఏర్పాటు చేశారు. అది నిత్యం అనేకమందిని పలు విభాగాలకు చేరవేసేది. రోగులు, సహాయకులు ఆసుపత్రి ప్రాంగణంలో ప్రయాణిస్తూ ఆ వాహనాన్ని సద్వినియోగం చేసుకున్నారు. అలాంటి విద్యుత్ వాహనం ప్రస్తుతం మూలనపడింది. దుమ్మూ, ధూళితో కమ్ముకుపోయింది. గత ఆరునెలల నుంచి మూలనపడ్డది. దీంతో ఆసుపత్రికి వచ్చేవారంతా దూరంలో ఉన్న విభాగాలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు.

బంజారాహిల్స్‌లోని ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి నుంచి గ్లకోమా వాక్‌ను ప్రారంభించిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తదితరులు

గ్లకోమాపై అవగాహన అవసరం: సజ్జనార్

బంజారాహిల్స్, మార్చి16: ప్రపంచ గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా బంజారాహిల్స్‌లోని ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఆదివారం గ్లకోమా అవగాహన వాక్ ను ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మందిని ప్రభావితం చేసే గ్లకోమాపై అవగాహన పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆర్టీసీ తరపున గ్లకోమా వ్యాధిపై అవగాహన కల్పించేలా చేపట్టిన ప్రచార కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటామని బస్టాండ్లు, బస్సులు, సిబ్బంది ద్వారా గ్లకోమా ప్రమాదం, కంటి పరీక్షల ప్రాముఖ్యతను ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ సెంథిల్, డా.సిద్ధార్థ దీక్షిత్,డా.శిరీషా సెంథిల్, డా. చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఈఎన్‌టీ కొత్త భవనం ఎప్పుడు కట్టిస్తరు?

నిధులు మంజూరు చేసిన కేసీఆర్ సర్కార్
విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

సిటీ బ్యూరో/సుల్తాన్ బజార్, మార్చి 16, (నమస్తే తెలంగాణ): కేసీఆర్ సర్కార్ వైద్యరంగానికి పెద్దపీట వేస్తే అధికార కాంగ్రెస్ దాన్ని పట్టించుకోవడంలేదు. పేద ప్రజలకు దిక్కుమొక్కైన సర్కార్ దవాఖానాలను నిర్వీర్యం చేసే దిశగా రేవంత్ సర్కార్ ఆలోచనలు చేస్తుంది. హైదరాబాద్‌లో ఉన్న ప్రభుత్వ ఈఎన్‌టీ ఆసుపత్రి ప్రాంగణంలో ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్‌ను నిర్మించేందుకు 2022లో నాటి వైద్యారోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం నిర్మాణ పనులకుగాను రూ.35 కోట్లు విడుదల చేసింది. గుత్తేదారు ఆ స్థలంలో పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు సైతం చేశాడు. తీరా ప్రభుత్వం మారడంతో ప్రస్తుతమున్న రాష్ట్ర ప్రభుత్వం ఆ నిర్మాణాన్ని పక్కన పెట్టింది.

పునాది వేసింది కేసీఆర్ సర్కారే..

హైదరాబాద్‌లో ఉన్న ఈఎన్‌టీ ప్రభుత్వ ఆసుపత్రికి రెండు తెలుగు రాష్ట్రాలనుంచి అనే వేల మంది రోగులు వస్తుంటారు. ఈ భవనంలో పలుచోట్ల పెచ్చులూడటంతో గత రాష్ట్ర ప్రభుత్వం నూతన భవనం నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే ఆసుపత్రి ప్రాంగణంలోని ముందుభాగంలో నిర్మించేందుకు మొదట ప్రణాళికలు చేయగా, స్థానికుల అభ్యర్థన మేరకు వెనుక ప్రాంతంలో నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే నాటి వైద్యారోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు సుమారు రెండు ఎకరాల స్థలంలో నూతనంగా ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సంకుస్థాపన చేశారు. నూతనంగా నిర్మించే ఐదంతస్తుల భవనంలో అత్యాధునిక పద్ధతుల్లో ఇంటన్సీవ్ కేర్ యూనిట్(ఐసీయూ), ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్, ఐసీయూ పోస్ట్ ఆపరేషన్ వార్డు, ఔట్ పేషెంటు సేవలు అందించనున్నారు.

అందుబాటులోకి వచ్చేదెన్నడు..

ఇప్పటివరకు పనులన్నీ పునాదుల వద్దే నిలిచిపోయాయి. ఆ పనుల్లో భాగంగా వెనుక వైపు ఉన్న ఆసుపత్రి గేట్ మూసేయడంతో అత్యవసర చికిత్స కోసం వాహనాల్లో వచ్చేరోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. రోజురోజుకు రోగుల సంఖ్య పెరుగుతుంది. ఆసుపత్రి భవనం కూడా పాతది కావడంతో ఏ క్షణంలోనైనా పెచ్చులూడే పరిస్థితి నెలకొంది.రాష్ట్ర ప్రభుత్వం చొరువ తీసుకొని త్వరగా పనులను పూర్తి చేసి రోగులకు సేవలందించాలి.

గ్రీన్ మెట్రో ఎలక్ట్రిక్ బస్సు ప్రారంభం

సిటీబ్యూరో, మార్చి16, (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్‌లో నేడు నూతనంగా రెండు గ్రీన్ మెట్రో లగ్జరీ ఎలక్ట్రిక్ ఏసీ బస్సు సేవలను ప్రారంభించనున్నట్లు ఆర్టీసీ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ బస్సులు బాచుపల్లి, రాజీవ్ గాంధీనగర్, నిజాంపేట్, నిజాంపేట్ ఎక్స్ రోడ్, జేఎన్‌టీయూ, ఫోరమ్ మాల్, మలేసియన్ టౌన్‌షిప్, సైబర్ టవర్స్, టీసీఎస్, రాయదుర్గం మెట్రో స్టేషన్, మైండ్ స్పేస్ జంక్షన్, టీ హబ్ ప్రాంతాల గుండా ప్రయాణించనున్నట్లు తెలిపారు.

బీసీ గురుకులాల్లో ప్రవేశాలకు ఆహ్వానం

సిటీ బ్యూరో, మార్చి 16 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ జిల్లాలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలురు, బాలికల గురుకుల విద్యాలయాల్లోని (ఆంగ్ల మాధ్యమం) 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలిపోయిన సీట్లలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆదిత్య వర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ ఈ నెల31 అని తెలిపారు. మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. బీసీ గురుకులాల అధికారిక వెబ్ సైట్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని, ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 20న ఉంటుందని తెలిపారు.

నగరంలో పెరుగుతున్న కాలుష్యం

చేయి జారుతున్న ఆరోగ్యం

సిటీబ్యూరో, మార్చి16, (నమస్తే తెలంగాణ):నగరవాసుల ఆరోగ్యం రోజు రోజుకు చేజారిపోతుంది. తెలియకుండానే కాలుష్య కోరల్లో జీవిస్తూ నిత్యం అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. కనిపించని కాలుష్య కారకాలు మన శ్వాసలో కలిసిపోతున్నాయి. రాష్ట్ర రాజధాని నగరంలో జనాభా పెరుగుదలతో పోటీపడుతూ కాలుష్యం పెరుగుతోంది. స్వీయ నియంత్రణ లోపిస్తే ఆసుపత్రుల్లో చేరాల్సిన పరిస్థితులు ఏర్పడుతాయి.

మూడో స్థానంలో హైదరాబాద్

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆదివారం వాయు నాణ్యత సూచికలో నమోదైన సంఖ్యను చూస్తే గాలి ఏ స్థాయిలో కాలుష్యమవుతుందో అవగతమవుతుంది. హైదరాబాద్‌లో వాయు నాణ్యత సూచిక 124 నమోదు కాగా, పీఎం10 స్థాయి 86, పీఎం2.5 స్థాయి 47గా నిలిచింది. దేశంలోని మెట్రో నగరాలతో పోల్చినప్పుడు అత్యంత కాలుష్య నగరంగా పూణే నిలవగా, ఆ తరువాత ముంబాయి. మూడోస్థానంలో హైదరాబాదే ఉంది.

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో కాలుష్య తీవ్రత అధికంగా ఉంది. విట్టల్ రావు నగర్ ప్రాంతంలో వాయు నాణ్యత సూచిక 181 నమోదైంది. సోమాజిగూడలో 149, సైదాబాద్‌లో 134, మణికొండలో 115, కోకాపేటలో 133, కోటిలో 134, కేపీహెచ్‌బీలో 140, మాదాపూర్‌లో 135 వాయు నాణ్యత సూచికలో నమోదు కావడం గమనార్హం .

ఈ కాలపు మానవుని సందిగ్ధావస్థ ఆవిష్కరణ

పుస్తకాలను ఆవిష్కరిస్తున్న జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, ప్రొ.హరగోపాల్ తదితరులు

అమీర్‌పేట్ మార్చి 16: విశ్వనాథ సాహిత్య పీఠం పక్షాన పీఠం చైర్మన్ వెలిచాల కొండలరావు తెలుగులోకి అనువదించిన 8 గ్రంథాల ఆవిష్కరణ ఆదివారం అమీర్‌పేట్ డీకే రోడ్‌లోని సిస్టర్ నివేదిత స్కూల్ ఆడిటోరియంలో జరిగింది. ఈ పుస్తకావిష్కరణ సభకు ముఖ్య అతిథిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి హాజరై తెలుగులోకి అనువదించిన 'ఈ కాలపు మానవుని సందిగ్ధావస్థ' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. దీంతోపాటు హర్ రూమ్, గాలిబ్స్ కప్లేట్స్, మోచిరామ్, రవీంద్రనాథ్ ఠాగూర్ రచనలు గీతాంజలి వంటి ప్రసిద్ధ పుస్తకాలను అనువదించిన విశ్వనాథ సాహిత్య పీఠం చైర్మన్ డాక్టర్ వెల్చాల కొండలరావు సాహితీ సేవలను వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ హరి గోపాల్, బి నర్సింగ్‌రావు నలిమెల భాస్కర్, ప్రొఫెసర్ కె వీరారెడ్డి ప్రొ.వి విశ్వనాథం ప్రొ. యాదగిరిరావు పాల్గొన్నారు.

ఘనంగా సైక్లోథాన్

రవీంద్రభారతి, మార్చి16ః ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా ఆదివారం రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ అంబుడ్‌మన్ కార్యాలయం ఎదుట సైక్లోథాన్‌ను నిర్వహించింది. తెలుగు రాష్ట్రాల చీఫ్ జనరల్ మేనేజర్, బ్యాంకింగ్ అంబుడ్స్‌మన్ చిన్మోయ్‌కుమార్, హైదరాబాద్‌లోని రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ శ్రీ అనుజ్ రంజన్‌లు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పిల్లల నుండి సీనియర్ సిటిజన్ల వరకు వివిధ వయస్సుగల వారు 200 మంది వరకు సైక్లిస్టులు పాల్గొన్నారు. తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల డిప్యూటీ బ్యాంకింగ్ అంబుడ్స్‌మన్ కళ్యాణ చక్రవర్తి, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

నగరంలో తొలి రీససిటేషన్ అకాడమీ

సిటీబ్యూరో, మార్చి16, (నమస్తే తెలంగాణ): భారతదేశపు మొట్టమొదటి రీససిటేషన్ అకాడమీ హైదరాబాద్‌లోని ఈఎంఆర్ఐ జీహెచ్ఎస్ క్యాంపస్‌లో ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవో ఆర్‌వీ కర్ణన్ అకాడమీని ప్రారంభించారు. 108 అత్యవసర అంబులెన్స్ సేవల ఆధునికీకరణతో పాటు, గుండెపోటు కేసుల్లో ప్రాణాలను కాపాడే విధానాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ అకాడమీ పనిచేయనుంది. ప్రస్తుతం తెలంగాణలో ప్రతి 64,500 మందికి ఒక అంబులెన్స్ అందుబాటులో ఉండగా, 50,000 మందికి ఒక అంబులెన్స్ కేటాయించే విధంగా చర్యలు చేపట్టనున్నారు.

కొలనులో ఆటలు.. మెరికల్లా పిల్లలు

అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థుల ప్రతిభ
ఆశ్రమ పాఠశాలను వాటర్ స్పోర్ట్స్‌అకాడమీగా మార్చిన కేసీఆర్ ప్రభుత్వం

సిటీబ్యూరో, మార్చి 16 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి వాటర్ స్పోర్ట్స్ అకాడమీ విద్యార్థులు అద్భుతాలు సృష్టిస్తున్నారు. అకాడమీని స్థాపించిన మూడేండ్లకే అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ మన పిల్లలు శభాష్.. అనిపించుకుంటున్నారు. ప్రపంచ ఛాంపియన్ షిప్‌లో ఏకంగా 6 పతకాలను సాధించి తెలంగాణ కీర్తి పతాకను ఎగురవేశారు. జల క్రీడలు కయాకింగ్, కనోయింగ్, డ్రాగన్ బోట్‌తో పాటు ఫెన్సింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ అకాడమీని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లారు. తెలంగాణ బ్రాండ్‌ను క్రీడల్లో విశ్వవ్యాప్తం చేయాలని సంకల్పించి నాటి కేసీఆర్ ప్రభుత్వం వాటర్ స్పోర్ట్స్ అకాడమీని 2022-23 విద్యాసంవత్సరంలో ఏర్పాటు చేసింది. ప్రతిభావంతులైన కోచ్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులకు నిత్యం శిక్షణనిస్తూ ఆటల్లో రాటుదేలేలా చేస్తున్నారు. బోయిన్‌పల్లిలోని ఈ వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో 2025-26 విద్యా సంవత్సరంలో చేరేందుకు అర్హులైన విద్యార్థుల నుంచి హైదరాబాద్ గిరిజన సంక్షేమ శాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నది.

మూడేండ్లలోనే ప్రపంచ గుర్తింపు...

వాటర్ స్పోర్ట్స్‌అకాడమీ స్థాపించిన మూడేండ్లలోనే తెలంగాణ సత్తా ప్రపంచానికి తెలిసేలా రాణిస్తున్నారు. 2024 అక్టోబర్ 30న ఫిలిప్పీన్స్‌లో నిర్వహించిన డ్రాగన్ బోట్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో ముగ్గురు విద్యార్థులు పాల్గొని ఐదు పతకాలను సాధించారు. అందులో ఒక సిల్వర్, నాలుగు బ్రాంచ్ పతకాలున్నాయి. 2024 ఫిబ్రవరి 9 నుంచి 12 వరకు మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో నిర్వహించిన 12వ జాతీయ డ్రాగన్ బోట్ చాంపియన్‌షిప్, 32వ కానోస్ప్రింట్ టోర్నీలో 10 మంది విద్యార్థులు కాంస్య పతకాలు సాధించారు. 2024 జూన్ 14 నుంచి 18 వరకు ఒడిశాలోని కటక్‌లో నిర్వహించిన 6వ అండర్ చైల్డ్ యూ-10 ఫెన్సింగ్ నేషనల్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించారు.

హుస్సేన్ సాగర్ స్టాగ్‌బోట్స్ క్లబ్‌లో శిక్షణ..

బోయిన్‌పల్లి వాటర్ స్పోర్ట్స్‌అకాడమీలో విద్యార్థులను గేమ్స్‌తో పాటు చదువులోనూ ఉత్తమంగా తీర్చిదిద్దుతున్నారు. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు హుస్సేన్ సాగర్ స్టాగ్స్ బోట్స్ క్లబ్‌లో జల క్రీడలకు ఎర్రా భూపాల్, ఫెన్సింగ్ కు శివానంద్ శిక్షణ ఇస్తారు. శిక్షణ కోసం కావాల్సిన సామగ్రిని తెలంగాణ స్పోర్ట్స్‌అ థారిటీ సమకూరుస్తున్నది. కోచింగ్ పర్యవేక్షణ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్పోర్ట్స్‌అథారిటీ సౌజన్యంతో కొనసాగుతుంది.

ఫిజికల్ ఫిట్‌నెస్ ఆధారంగా ఎంపిక

విద్యార్థుల ఫిజికల్ ఫిట్‌నెస్ ఆధారంగా వాటర్ స్పోర్ట్స్ అకాడమీకి ఎంపిక చేస్తారు. ఎంపికైన విద్యార్థుల ఆసక్తి, నైపుణ్యాలను ఆధారంగా చేసుకుని జల క్రీడలు కాయకింగ్, కనోయింగ్, డ్రాగన్ బోట్ ఆటల్లో శిక్షణ ఇస్తాం. ఫెన్సింగ్ ఆటపై ఆసక్తి ఉన్నవారికి అందులో తర్ఫీదు అందిస్తాం. ప్రస్తుతం అకాడమీలో 94 మంది విద్యార్థులు ఉన్నారు. వారిలో వాటర్ స్పోర్ట్స్‌లో 58 మంది, ఫెన్సింగ్ గేమ్‌లో 38 మంది శిక్షణ పొందుతున్నారు.

– ఎర్ర భూపాల్, వాటర్ సోర్ట్స్‌కోచ్

రాష్ట్రంలోని అన్ని జిల్లాల విద్యార్థులకు అవకాశం

బోయిన్‌పల్లిలోని వాటర్ స్పోర్ట్స్ అకాడమీ గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నాం. విద్యార్థుల చదువు, శిక్షణ, పోటీల్లో పాల్గొనేందుకు అయ్యే ఖర్చును గిరిజన అభివృద్ధి శాఖ భరిస్తుంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల విద్యార్థులు అకాడమీలో చేరవచ్చు. ఇందులో గిరిజన విద్యార్థులకు 80 శాతం సీట్లు, ఎసీ, బీసీ, ఓసీ విద్యార్థులకు కలిపి 20 శాతం సీట్లు కేటాయిస్తాం. ప్రతి సంవత్సరం 5 నుంచి 8వ తరగతి వరకు బాలబాలికలకు ప్రవేశాలు కల్పిస్తున్నాం.

– కోటాజీ, గిరిజన అభివృద్ధి శాఖ అధికారి, హైదరాబాద్

శిశువుల కోసం ధాత్రి తల్లిపాలు

3000మంది చిన్నారులకు పంపిణీ
నిలోఫర్‌లో పిల్లలకు తల్లిపాలనిధి దాతృత్వం

సిటీ బ్యూరో/తెలుగు యూనివర్సిటీ, మార్చి 16, (నమస్తే తెలంగాణ): పుట్టగానే తల్లి పాలకోసం చిన్నారులు తల్లడిల్లుతుంటారు. కొన్ని సందర్భాల్లో ఆ పాలు దొరక్క ఆకలితో అలమటిస్తుంటారు. పాలకోసం గుక్కపట్టి ఏడ్చి ప్రాణాలు వదిలేసిన చిన్నారులు కొందరైతే, డబ్బా పాలు తాగి అనారోగ్యానికి గురయ్యేవారు మరికొందరు. ఇలాం టి దారుణాలెన్నో మన చుట్టే చూస్తుంటాం. కనీసం కొంతమంది చిన్నారులనైనా తల్లిపాలతో బతికించేందుకు ధాత్రి తల్లిపాల నిధి కేంద్రంగా ప్రయత్నిస్తున్నారు పలువురు తల్లులు.

చిన్నారుల ఆకలి తీర్చుతున్నారు...

హైదరాబాద్ మహానగరంలోని నిలోఫర్ ఆసుపత్రికి తెలంగాణ, ఏపీ తోపాటు ఇతర దక్షిణ రాష్ట్రాల నుంచి కూడా బాధితులు వస్తుంటారు. బాలింతలు, గర్భిణీలు, చిన్నారులకు నిలోఫర్‌లో చికిత్సనందిస్తున్నారు. ప్రసవించిన తరువాత తల్లులు కొన్ని రోగాలకు గురవుతుంటారు. ఆ సమయంలో బిడ్డలకు పాలిచ్చేందుకు వీలుపడదు. అదేవిధంగా బిడ్డకు పాలిస్తే తమ అందం తరిగిపోతుందనే ఆపోహలో మరికొందరు పిల్లలకు పాలిచ్చేందుకు దూరంగా ఉంటారు. అలాంటి సందర్భంలోనే నిలోఫర్ ఆసుపత్రిలోని ధాత్రి తల్లిపాల నిధి మేలు చేస్తుంది. పాలులేక ఆకలితో ఏడిచే చిన్నారులకు తల్లిపాలనందిస్తోంది. 2017లో ప్రారంభించిన ఈ స్వచ్ఛంద సంస్థకు ఏడాదిలో సుమారు పదివేలమందికి పైగా తల్లులు స్వచ్ఛందంగా తమ పాలను ఇస్తున్నారు. సేకరించిన పాలను నిల్వచేసి, వాటిని పాశ్చరైజేషన్ చేసి అవసరమున్న వారికి ఉచితంగా అందిస్తున్నారు. ఈ విధంగా సంవత్సరానికి 3000 పైగా చిన్నారులకు దాదాపు 210 లీటర్ల పాలను అందిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నారిలా..

ఎంతో మంది తల్లులు తమ చిన్నారులతో నిలోఫర్‌కు వైద్యంకోసం వస్తుంటారు. కొన్ని సార్లు తల్లి ఆనారోగ్యం వల్ల కూడా బిడ్డకు పాలిచ్చేందుకు ఇబ్బందిపడతారు. ఆలాంటి వాళ్లకు ఈ ధాత్రి తల్లి పాలనిధి చేదోడుగా నిలుస్తోంది. వైద్యుల సూచనల మేరకు కావాల్సిన పరిమాణంలో బిడ్డకు పాలను సేకరించి అందిస్తుంటారు. ఇలా బిడ్డ కోలుకునే వరకు ఈ ప్రక్రియ జరుగుతుండటం గమనార్హం. అయితే ఒక పక్క బిడ్డలకు పాలు కావాలంటే మరోపక్క ఎవరో ఒక్కరూ ఇవ్వాల్సిందే. బాలింతలు తమ బిడ్డలకు ఇవ్వగా మిగిలిన పాలను ధాత్రి పాలనిధికి ఇచ్చేలా అక్కడున్న వైద్యులు వివరిస్తున్నారు. దాంతో అనేక మంది తల్లులు ముందుకు రావడం జరుగుతోంది. తమిచ్చే పాలతో చిన్నారుల ప్రాణం నిలబెడుతున్నందుకు తల్లులు సైతం సంతోషిస్తున్నారు.

అపోహలు వద్దు..

చాలా మంది తల్లులు పాలు ఇవ్వడం వల్ల అందం తగ్గుతుందని, పాలు తాగే పిల్లలకు తమ వారసత్వం వస్తుందని అపోహపడుతుంటారు. అలాంటివి అబద్దాలని వైద్యులు వెల్లడిస్తున్నారు.

ధాత్రి తల్లిపాల నిధి వివరాలు(2024 ఏడాది వరకు)

ఏడాది	పాలిచ్చిన తల్లులు	పాలు స్వీకరించిన చిన్నారుల సంఖ్య	సేకరణ (లీటర్లలో)	పంపిణీ (లీటర్లలో)
2017	932	452	68.94	45.50
2018	10219	2414	449.56	374.98
2019	13657	3656	85.56	398.05
2020	3578	1719	125.38	138.88
2021	3604	1012	129.78	104.86
2022	9793	2569	137.05	359.54
2023	12516	3103	218.09	306.96